## క్లుప్తంగా

### యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న మల్లేష్ తదితరులు

**కొయ్యూరు:** బాల్య వివాహాలను నిరోధించేందుకు అంతా ముందుకు రావాలని హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి టి.మల్లేష్ అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం డౌనూరు పంచాయతీ జోడుమామిడిలో బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను ఆయన వివరించారు. పౌష్టికాహారం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని సూచించారు. పది, ఇంటర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా వారికి నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. యువత క్రీడల్లో రాణించాలంటూ వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. సభ్యులు తిరుపతిబాబు, దేవరాజ్, సన, రాజు పాల్గొన్నారు.

### రహదారులు జలమయం

**హుకుంపేట:** మండలంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం ఆదివారం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద శబ్దాలతో ఉరుములు, మెరుపులు రావడంతో గిరిజనులు భయాందోళన చెందారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం


వేడుకలో పాల్గొన్న భక్తులు

**మోతుగూడెం:** పొల్లూరు సాయిబాబా ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు అయినవిల్లి కుమార స్వామి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్న సమారాధన జరిగింది. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రసాదాన్ని స్వీకరించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఏపీ జెన్‌కో సీఈ వాసుదేవరావు, డీఈటీ వరప్రసాద్, ఎస్ఏఈ ప్రసాద్, ఏడీఈ కొండబాబు, పవన్, దుర్గా మల్లేశ్వర, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### రోడ్డు పనుల పరిశీలన

**హుకుంపేట:** పీవీటీజీ గ్రామాల్లో జన్‌మన్ పథకం ద్వారా బీటీ రోడ్లు మంజూరయ్యాయని, త్వరలోనే రహదారి సమస్యలు పరిష్కారం కానున్నట్టు సర్పంచ్ పాంగి బేసు, ఎంపీటీసీ సభ్యుడు కొర్ర నాగరాజు తెలిపారు. తీగలవలస పంచాయతీలోని జన్‌మన్ పథకం ద్వారా మంజూరైన పనసబంద, పాములాయి, నిమ్మలగొంది గ్రామల్లో ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పంచాయతీలో రోడ్డు సౌకర్యం సరిగ్గా లేని గ్రామాలకు ఇక మోక్షం కలగనుందని కొద్ది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నట్టు చెప్పారు. పీఆర్ జేఈ సంజీవరావు, వార్డు సభ్యులు శంకర్, శంకరరావు, గ్రామ పెద్దలు త్రినాథ్, చందు, భీమరాజు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు అభినందనలు

**పరవాడ:** బిహార్‌లో ఈ నెల 12 నుంచి 14 వరకు జరగనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-25కు పరవాడ, అచ్యుతాపురం మండలాల నుంచి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ గొర్లి పుష్పారావు తెలిపారు. వీరిలో వాడచీపురుపల్లి శివారు వెంకటాపురానికి చెందిన గొర్లి స్నేహ, గండి దీక్షిత్, అచ్యుతాపురానికి చెందిన డి.ఎ.గౌతమ్ ఉన్నారని చెప్పారు.ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు అభినందించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రాణించాలని ఆకాంక్షించారు. పరవాడ ప్రాంతం నుంచి ముగ్గురు క్రీడాకారులను ఎంపిక చేయడంపై ఏపీ థాంగ్ టా అసోసియేషన్ చీఫ్ ఎం.తులసీరావు ఆనందం వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కోచ్ పుష్పారావును ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### వైభవంగా అమ్మవారి జాతర

**కోటవురట్ల:** సుంకపూరు గ్రామంలో గంగమ్మ తల్లి జాతరను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజాము నుంచి భక్తుల తాకిడి నెలకొంది. సమీప గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు మొదట గంగమ్మతల్లిని దర్శించుకుని పాడి పంటలతో అంతా సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు. ఆ తర్వాత సంప్రదాయం ప్రకారం పావుకోళ్ల చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

# దారులు ఇలా... ప్రయాణమెలా

అధ్వానంగా కుజభంగి– రూడకోట తారురోడ్డు
ఇరుకైన దారితో ఇక్కట్లు
పెరుగుతున్న ప్రమాదాలు
ప్రయాణికుల అవస్థలు
పట్టించుకోని అధికారులు


పవ్రెడలో రోడ్డు దుస్థితి

**పెదబయలు:** పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలను కలుపుతూ నిర్మించిన తారురోడ్డు గోతులతో అధ్వానంగా తయారైంది. ముంచంగిపుట్టు మండలం కుజభంగి జంక్షన్ నుంచి పెదబయలు మండలం రూడకోట వరకు 10 కిలోమీటర్ల తారురోడ్డు దారుణంగా ఉంది. ఐదేళ్ల క్రితం నిర్మించిన రోడ్డు గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. బంగారుమెట్ట, పవ్రెడ, పెద్దావుట్టు, పెద్దాపుట్టు ఘాటీ, రూడకోట గ్రామ సమీపంలో ఘాట్ ప్రదేశాల్లో రోడ్డు గుంతలు ఏర్పడింది. వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గోతుల్లో నీరు ఉండడంతో వాహనచోదకులు జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారని, గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా నేటి వరకు రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. అత్యవసర పరిస్థితిల్లో 108, 104 ఇతర వాహనాలు రావడానికి ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కుజభంగి నుంచి రూడకోట వరకు గోతులతో ఉన్న రోడ్డును మరమ్మతు చేయాలని పెదబయలు, ముంచంగిపుట్టు సరిహద్దు ప్రాంతాలైన బంగారుమెట్ట, పవ్రెడ, రూడకోట, బొండాపల్లి, కుమడ, కొరవంగి, బాబుశాల, బూసిపుట్టు గ్రామస్తులు కోరుతున్నారు.


రూడకోట గ్రామ కల్వర్టు సమీపంలో ఏర్పడిన గోతులు

**ఇరుకైన రోడ్డుతో ఇక్కట్లు**

పెదబయలు మండలం సీకరి పంచాయతీ బంగారుమెట్ట అడుగులపుట్టు పంచాయతీ సంపంగిపుట్టు వరకు తారురోడ్డు విస్తరణ చేయాలని అనేకమార్లు అధికారులను కోరినా స్పందించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. నాలుగు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ కాక నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారంటున్నారు. ఈ మార్గంలో రహదారికి ఇరువైపులా 2అడుగుల రోడ్డు అంచు కోతకు గురైందని, ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనచోదకులు గాయాలపాలవుతున్నారని, వాహనాలు రోడ్డుపై అడ్డుగా ఉండడంతో గంటలకొద్దీ ట్రాఫిక్ స్తంభిస్తుందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి తారురోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ప్రతిపాదనలు పంపాం



మండలంలో పాడైన రోడ్ల వివరాలు ఐటీడీఏ, జిల్లా ఉన్నతాధికారులకు నివేదించాం. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కూడా పరిశీలించి నివేదించడం జరిగింది. రహదారులు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నుంచి రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

– ఎల్.పూర్ణయ్య, ఎంపీడీవో, పెదబయలు మండలం

### రోడ్డు నిర్మించాలి



కుజభంగి జంక్షన్ నుంచి రూడకోట వరకు రోడ్డు పెద్ద పెద్ద గోతులు ఏర్పడి దారి అధ్వానంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి కనిపించడం లేదు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, 108, 104 ఇతర అత్యవసర సేవలకు ఈ రోడ్డు ఇబ్బందిగా మారింది. రోడ్డు బాగా లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి 10 కిలోమీటర్ల తారురోడ్డు పూర్తి స్థాయిలో మరమ్మత్తులు పనులు చేయాలి, లేకుంటే ఇదే రోడ్డుపై పంచాయతీ ప్రజలతో ఆందోళన చేస్తాం.

– కాతారి సత్యారావు, సర్పంచ్, రూడకోట

### అధికారులు స్పందించాలి



గోతుల రోడ్డుతో నిత్యం అవస్థలు పడుతున్నాం. ముంచంగిపుట్టు మీదుగా తిరిగి రావాలంటే ఎక్కువ దూరం అవుతుంది. గోతుల దారితో అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడుతుంది. మారుమూల కుమడ, బూసిపుట్టు, కొరవంగి, రూడకోట, జామిగుడ పంచాయతీలకు అత్యవసర సేవల కోసం సమాచారం ఇస్తే రోడ్డు బాగాలేని కారణంగా ముంచంగిపుట్టు మీదుగా అంబులెన్స్, ఇతర సేవలు రావడం వల్ల సేవలకు జాప్యం జరుగుతుంది. అధికారులు స్పందించాలి.

– తెరవాడ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు, జామిగుడ పంచాయతీ

## ఘనంగా అన్నమయ్య జయంతి వేడుకలు


వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

**జి.మాడుగుల:** మండలంలో గడుతూరు పంచాయతీ రాళ్లపుట్టులో ఆదివారం తాళ్లపాక అన్నమాచార్యులు జయంతిని అన్నమయ్య కళా క్షేత్ర వశిష్ట ఆశ్రమ జిల్లా కన్వీనర్ వనగాల సత్య బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుమల కొండపై కూల్చివేసిన అన్నమయ్య గృహం, అన్నమయ్య విగ్రహన్ని, హనుమంతుని విగ్రహాన్ని పునర్ ఆయన డిమాండ్ చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ పుణ్యక్షేత్రాల్లో అన్ని చోట్ల హరినామ కీర్తన ప్రారంభించి అల్లూరి జిల్లాలోని గిరిజన భక్తులకు తిరుమల కొండపై భజన, కోలాటకు అవకాశం కల్పించాలని కోరారు. భజనలు సత్సంగాలు, సేవా కార్యక్రమాలు జరిగేటట్టు కృషి చేయాలని కోరారు. అశ్రమ అన్నమయ్య కళాశాల కేత్ర భక్తులు ముత్యంనాయుడు, వీరన్నపడాల్, నాగభూషణం, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## చిత్తడి దారితో సతమతం


రంగన్నకొండ వంతెనపై చేరిన వర్షపు నీరు

**ముంచంగిపుట్టు:** ముంచంగిపుట్టు మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే ఆర్అండ్‌బీ ప్రధాన మార్గంలో రంగన్నకొండ గ్రామ సమీపంలో ఉన్న వంతెనపై వర్షపు నీరు నిలిచిపోయి ప్రమాదకరంగా మారింది.ఈ మార్గంలో రోజు వందలాది వాహనాలు రాకపోకలు చేస్తూ ఉంటాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వంతెనపై నీరుచేరడంతో బురద నిండిపోయి ఉంది. వాహనదారులు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం తప్పదని స్థానికులు చెబుతున్నారు. దీంతో వాహనచోదకులు భయం భయంగా ప్రయాణాలు సాగించాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్షపు నీరు వంతెనపై నిల్వ లేకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులతో పాటు వాహనచోదకులు కోరుతున్నారు.

## మోదకొండమ్మ తల్లి జాతర దృశ్యమాలిక


సతకంపట్టు వద్ద బారులు తీరిన భక్తులు


జాతరలో స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, జేసీ అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్ తదితరులు


జాతరలో థింసా నృత్యం చేస్తున్న గిరిజన కళాకారులు

## నేడు పీసా కమిటీ ఎన్నిక

**అడ్డతీగల:** కోరం లేక తరచూ వాయిదా పడుతున్న పీసా గ్రామ కమిటీ ఎన్నిక సోమవారం బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనున్నట్టు అడ్డతీగల గ్రామ కార్యదర్శి పల్లాల పద్మ లక్ష్మి తెలిపారు. ఉదయం 9 గంటల వరకూ నామినేషన్లు స్వీకరణ, 9 నుంచి 10 గంటల వరకూ నామినేషన్లు పరిశీలన, 10 గంటల నుంచి 2 గంటల వరకూ ఎన్నిక జరుగుతుందన్నారు. సాయంత్రం 4గంటల్లోగా కౌంటింగ్ ప్రక్రియ పూర్తిచేసి గెలుపొందిన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేస్తామన్నారు.ఎన్నికల్లో పాల్గొనే ఉపాధ్యక్ష అభ్యర్థుల పేర్లకు ఎదురుగా గుర్తులకు బదులుగా 1, 2, 3 నంబర్లు కేటాయించనున్నట్టు చెప్పారు. కార్యదర్శి ఎన్నికకు సంబంధించి అభ్యర్థి పేర్లకు ఎదురుగా ఏ, బీ, సీ. లెటర్స్ ఉంటాయన్నారు. ఓటర్లు పాల్గొని ఉపాధ్యక్ష, కార్యదర్శి ఎన్నిక ప్రక్రియను పూర్తిచేయడానికి సహకరించాలన్నారు.

## నూకాంబిక ఆలయానికి పోటెత్తిన భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

**అనకాపల్లి:** ఉత్తరాంధ్ర ఇలవేల్పు స్థానిక గవర పాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొంత మంది కుటుంబ సమేతంగా వచ్చి, ఆలయం వద్ద వంటలు చేసి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో క్యూలైన్లు అన్ని నిండిపోయాయి. ఆలయ ఈవో వెంపలి రాంబాబు బాలింతలకు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. చిన్నపిల్లలకు, వృద్ధులకు, బాలింతలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు మజ్జిగ, తాగునీరు, అమ్మవారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పట్టణ, ట్రాఫిక్ సీఐలు టి.వి.విజయ్‌కుమార్, ఎం.వెంకటనారాయణ ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ నాగ శ్రీను (గొల్ల బాబు) తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గోమాత పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

**అనకాపల్లి:** జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో దత్త విజయానంద తీర్థ స్వామిజీ వారి దివ్య అనుగ్రహంతో ఆదివారం తైలాభిషేకం, ఔదుంబర పత్రార్చన, ధూప, దీప నైవేద్యాలు, నీరాజనం, మంత్ర పుష్పం వంటి అనేక కార్యక్రమాలను అర్చకులు చేపట్టారు. హోమంలో పాల్గొనే భక్తులకు ఆలయ నిర్వాహకులు ఆంజనేయరాజు మధ్యాహ్నం అన్న సమారాధన, స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలోనే ఏకైక చింతామణి గణపతి దత్త క్షేత్రం అనకాపల్లి జిల్లా సిరసపల్లి గ్రామంలో ఉందన్నారు. భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

**రాజవొమ్మంగి:** స్థానిక గిరిజన సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాల కేంద్రంగా సోమవారం నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతున్నట్లు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఏర్పాట్లు పూర్తయినట్టు ఆయన ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఫస్ట్ ఇంటర్, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు సెకండ్ ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షలు ఈ నెల 20 తేదీ వరకు ఇప్పటికే ప్రకటించిన టైంటేబుల్‌ను అనుసరించి జరుగుతాయన్నారు.

**అడ్డతీగల:** ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రస్వామి తెలిపారు. ఫస్ట్ ఇయర్ -100 మంది, సెకెండ్ ఇయర్-40 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు చెప్పారు.గురుకుల కళాశాల నుంచి ఫస్ట్ ఇయర్- 35 మంది, సెకెండ్ ఇయర్-ఏడుగురు విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాస్తారని ప్రిన్సిపాల్ రామాంజనేయులు తెలిపారు. అడ్డతీగల ఎస్ఏసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 1212 మంది పరీక్షలు రాయనున్నారు. గంగవరం, వై.రామవరం, అడ్డతీగల మండలాల్లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకుల జూనియర్ కళాశాలలు, కేజీబీవీల నుంచి సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారు.

## ఇళ్ల నిర్మాణాలకు ఆటంకం.. లబ్ధిదారులకు ఇక్కట్లు


అరకొరగా జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులు

**గూడెంకొత్తవీధి:** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా పీవీటీజీలకు ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని భావిస్తున్న క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు అవరోధాలు ఏర్పడుతున్నాయని గూడెంకొత్తవీధి మండలం అమ్మవారి దారకొండ పంచాయతీలోని పలు గ్రామాల గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనులు ఇళ్లు నిర్మించుకునేందుకు వీలుగా గ్రామకంఠం భూములున్నప్పటికీ వాటిని అధికారికంగా కొలచి గిరిజనులకు రెవెన్యూ యంత్రాంగం అప్పగించకపోవడంతో సాంకేతికపరమైన ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఫలితంగా సర్వేకు ఆటంకం కలిగి ఇళ్ల నిర్మాణాలు ముందుకు కదలడంలేదని అమ్మవారి దారకొండ పంచాయతీ వార్డు సభ్యుడు గుంట ఆనందరావు తెలిపారు. రెవెన్యూ అధికారులు స్పందించి తమ పంచాయతీలో గ్రామ కంఠం భూముల సర్వే పూర్తి చేయాలని తాము కలెక్టర్‌ను కోరినట్టు ఆయన తెలిపారు.

## శారదా పీఠంలో యాగం ప్రారంభం


స్వామీజీల పర్యవేక్షణలో నిర్వహిస్తున్న యాగం

**పెందుర్తి:** భారత్, పాకిస్థాన్ మధ్య జరుగుతున్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో దేశ రక్షణ, విజయం కోసం శారదా పీఠం తలపెట్టిన వజ్రిణి స్కంద పాశుపత హనుమద్యాగం ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ ప్రత్యక్ష పర్యవేక్షణలో తొలి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, అగ్ని సంస్కారం జరిపారు. అనంతరం స్కంద పాశుపత హోమం, చండీ నవార్ణ మహామంత్ర హోమం, దక్షిణామూర్తి స్వరూప సాంబ సదాశివ హోమం, వీరాంజనేయ హోమం వేద మంత్రోచ్ఛారణల మధ్య పండితులు అంకురార్పణ చేశారు. అపరాజిత స్తోత్రం, మహిషాసురమర్ధిని స్తోత్రం, కాలభైరవాష్టకం, హనుమాన్ చాలీసా పారాయణ పఠించారు. ఈ నెల 22 హనుమత్ జయంతి వరకు ఈ క్రతువు కొనసాగుతుందని ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర తెలిపారు.

### ఘనంగా విగ్రహ ప్రతిష్ట

**మాడుగుల:** అవురువాడ గ్రామంలో ఆదివారం సీతారాముల వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వామివారిని దర్శించుకున్నారు.